క్లుప్తంగా

గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి రమ

నల్లచెరువు: గ్రంథాలయ పన్నుల వసూలుకు కృషి చేయాలని మండల గ్రంథాలయ అధికారి ప్రసాద్‌నాయక్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆదేశించారు. మంగళవారం నల్లచెరువు శాఖ గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, పాఠకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల అందజేత



కుట్టుమిషన్లు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీలో కుట్టుపై శిక్షణ పొందిన కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన పేదల్లో మొదటి విడతగా 47 మందికి సత్యసాయిబాబా భక్తుల సహకారంతో మంగళవారం కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన హరిజవహరీలాల్, స్కాట్లాండ్‌కు చెందిన యాంజెలాడిక్సన్, హాంకాంగ్‌కు చెందిన మీరియా చేతుల మీదుగా వీటిని అందజేసినట్లు సొసైటీ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మావతి, భారతి, టైలరింగ్ కోచ్ వినుత, కంటి వైద్యులు బషీర్ అహమ్మద్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


విద్యార్థి అదృశ్యం



కె.త్రిలోక్

బత్తలపల్లి: బడికని వెళ్లిన విద్యార్థి తిరిగి ఇంటికి చేరలేదు. కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంపెట్ల గ్రామానికి చెందిన కె.క్రిష్టప్ప కుమారుడు కె.త్రిలోక్ బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం బడికని ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు స్నేహితులను విచారిస్తే మధ్యాహ్నం నుంచి బడికి రాలేదని సమాధానమిచ్చారు. అనంతరం వారు తెలిసిన వారి ఇళ్ల వద్ద, స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పరీక్షలకు భయపడి ఎటైనా వెళ్లిపోయాడేమోనని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థి ఎవరికైనా కనిపిస్తే సీఐ 94407 96832, ఎస్‌ఐ 94407 96833 నంబర్లలో సమాచారం తెలపాలని ఎస్‌ఐ కోరారు.


వైఎస్సార్‌సీపీ నేత మృతి



మృతుడు ఎం.సీ.వెంకటరెడ్డి

చెన్నేకొత్తపల్లి: పులేటిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎం.సీ. వెంకటరెడ్డి(82) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోవిందరెడ్డి, నాయకులు సానే రాజారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆదిరెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మృతునికి భార్య హేమావతితో పాటు కుమార్తె ఉన్నారు.

కుర్చీలు, జంకానాల వితరణ



కుర్చీల్లో కూర్చున్న చిన్నారులు

పుట్టపర్తి: కొత్తచెరువు యాక్సిస్ గ్రామీణ బ్యాంకు శాఖ వారు మంగళవారం బుక్కపట్నం పోలీస్ స్టేషన్ వెనుక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం 20 చైర్లు, పెద్దల కోసం నాలుగు చైర్లు, రెండు జంకానాలు వితరణ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఏరియా మేనేజర్ ఆదినారాయణ, బీఎం వసంత కుమార్, సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ కౌసల్యాసాయి, తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో వరుస చోరీలు

రామగిరి: మండలకేంద్రంలో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి బెస్త వెంకటస్వామికి చెందిన ఆరు మేకలు అపహరణకు గురయ్యాయి. మూడు రోజులక్రితం కంచుకుంట ఈరన్నకు చెందిన ఒక ఆవును ఎత్తుకెళ్లారు. వారం కిందట బాబయ్య ఇంటిలో 5 తులాల బంగారు నగలు చోరీ అయ్యాయి. పోలీసులు చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

గోమాత ఘోష..!



నిరుపయోగంగా మారిన గోశాల

- గోశాల ఉన్నా నిరుపయోగం
- గోవుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం
- రోడ్లపై తిరుగుతున్నా పట్టని వైనం
- ఇదీ ఖాద్రీశుని ఆలయ అధికారుల నిర్వాకం



లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గోవులకు మేత వేస్తున్న దృశ్యం



రహదారిపైన తిరుగుతున్న పశువులు

కదిరి టౌన్ : ప్రముఖ పుణ్యక్షేత్రం కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం. ఇక్కడకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటుంటారు. ప్రతి శనివారంతో పాటు ఏటా బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. భక్తులు మొక్కులలో భాగంగా గోవులను ఆలయంలో వదిలేస్తుంటారు. ఇలాంటి గోవుల కోసం ఆలయ అధికారులు గాండ్లపెంట మండలం కటారుపల్లి వద్ద రూ.5 లక్షల నిధులతో గోశాల ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో కొన్ని గోవులను ఆలయ ప్రాంగణంలోనే ఉంచి వాటి పాలతో శ్రీవారికి అభిషేకాలు నిర్వహిస్తున్నారు. భక్తులు సమర్పించే గోవులను గోశాలకు తరలించకపోవడంతో కొన్ని రోడ్లపై తిరుగుతున్నట్లు తెలుస్తోంది.

గోవుల ఆరోగ్యం గాలికి..

భక్తితో ఆలయానికి సమర్పించిన గోవులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన ఆలయ అధికారులు గాలికొదిలేశారు. దీంతో అలాంటి గోవులు రోడ్లపై తిరుగుతూ అక్కడే తిష్ట వేస్తున్నాయి. ఈ క్రమంలో గోవులు లంపీస్కిన్ (ముద్ద చర్మం) వంటి రోగాలబారిన పడుతున్నాయి. ఆలయ అధికారులు కానీ.. పశుసంవర్ధక శాఖ అధికారులు కానీ వాటి ఆరోగ్యం గురించి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు అక్రమార్కులు గోవులను రాత్రివేళ అపహరించుకుని కబేళాకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్లపై తిరుగుతున్న గోవులను మున్సిపల్ అధికారులైనా గోశాలకు తరలించి సంరక్షించాలని భక్తులు కోరుతున్నారు.

నిర్లక్ష్యంపై భక్తుల అసహనం

మొక్కులో భాగంగా ఆలయ సేవ కోసం గోవులను సమర్పిస్తే అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో గోవులను స్వామి సేవకోసం వదిలేసేవారు. నిత్యం భక్తులతో కిటకిటలాడుతూ ఆదాయపరంగా బాగున్నప్పటికీ ఆలయ అధికారులు గోవుల సంరక్షణను పట్టించుకోకపోవడం బాధాకరమని అంటున్నారు. నిర్వహణ సరిగా లేదని తెలుసుకున్న భక్తులు రెండు మూడేళ్లుగా గోవులను వదలడం లేదని తెలుస్తోంది.

పది ఆవులను సంరక్షిస్తున్నాం



శ్రీవారి భక్తులు ఇచ్చిన పది ఆవులను ఖాద్రీ నరసింహస్వామి ఆలయంలోనే సంరక్షిస్తున్నాం. ఈ ఆవుల పాలతోనే స్వామివారికి అభిషేకాలు చేస్తున్నారు. ఇక రోడ్లపై తిరుగుతున్న పశువులతో మాకు ఎలాంటి సంబంధమూ లేదు. భక్తులు ఇచ్చిన గోవులను ఆలయంలోనే ఉంచాం. వీటిని గోశాలకు తరలిస్తే అక్కడ ఏమైనా జరగరానివి జరిగితే ఇబ్బందులు తలెత్తుతాయి. అందుకనే ఇక్కడే ఉంచి సంరక్షిస్తున్నాం.

–వి.శ్రీనివాసరెడ్డి, ఈఓ, ఖాద్రీ ఆలయం

రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకోరా?



జాతీయ రహదారిపై పశువులు తిరుగుతున్నాయి. ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వాటికి మేత లేక చిత్తుకాగితాలు తినాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన పశువులను గోశాలకు తరలించి సంరక్షిస్తే బాగుంటుంది. ఆ దిశగా ఆలయ, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

–జి.ఎల్.నరసింహులు కదిరి

ముద్రిత నుండి - సంక్షిప్త సమాచారం

మున్సిపల్ రిజర్వు స్థలాలు కాపాడండి

ధర్మవరం: మున్సిపాలిటీలోని రిజర్వు స్థలాలను కాపాడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 31, 649, 650లోని రిజర్వు స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట నారాయణ, కార్యదర్శి వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, నాయకులు శ్రీధర్, బాలరంగయ్య, భుజంగం, శ్రీనివాసులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ కొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌యార్డు వద్దనున్న 33కేవీ/11కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, మున్సిపల్ ఆఫీస్, కదిరిగేటు, చంద్రబాబునగర్, శివానగర్, కేశవనగర్, చిన్నూరు, గొట్లూరు తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఓడీచెరువు : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

సొసైటీ అధ్యక్ష అభ్యర్థి ప్రచారం

ధర్మవరం అర్బన్: శ్రీ రేణుక యల్లమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్ష ఎన్నికల్లో తనను గెలిపించాలని జగలేటి నాగేశ్వరరావు గౌడ్ అభ్యర్థించారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఈడిగ కులస్తులతో సమావేశం నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈడిగ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రామమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు



బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు ఇళ్ల నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సాయి మనోహర్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతు అర్హులైన వారు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ జువాలజీ, సెరికల్చర్ కోర్సుల్లో ప్రథమ సంవత్సర ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. డిగ్రీ బీజెడ్‌సీ, సీజెడ్‌ఎస్ పూర్తి చేసి ఏపీపీజీసెట్ రాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94413 03146 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

చెన్నేకొత్తపల్లి : ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు కంటి పట్ల తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

డబ్బు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలో ఇంటి పట్టాల కోసం డబ్బు డిమాండ్ చేసిన కేసులో నిందితుడు సోమ్లానాయక్‌ను మంగళవారం కుటాగుళ్ల వద్ద అరెస్టు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 39 నకిలీ పట్టాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో హాజరుపరచగా.. నిందితుడికి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా అయ్యప్ప

రామగిరి: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా తిమ్మాపురం వాసి అయ్యప్ప నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దావులూరి శ్యాంసన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అయ్యప్ప మంగళవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పోరాడతానని ఆయన పేర్కొన్నారు.

అన్ని విషయాల్లోనూ అవగాహన ఉండాలి

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు అన్ని విషయాల్లోనూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యుత్ సబ్ స్టేషన్‌పై అవగాహన కల్పించారు. సబ్ స్టేషన్ సిబ్బంది విజయ్‌కుమార్ నాయక్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఫంక్షనింగ్, ఫీడర్స్, బ్రేకర్స్, విద్యుత్ సమస్యల గురించి వివరించారు. పాఠశాల విద్య ముగిసే నాటికి పలు పరిశ్రమలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన పెంపొందిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో చదివినవాటి కంటే చూసి తెలుసుకున్న వాటికే జ్ఞాపకశక్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రగ్స్‌రహిత సమాజానికి కృషి

ధర్మవరం అర్బన్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐలు చాంద్‌బాషా, నాగరాజు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, నాటుసారా, అక్రమ మద్యం, అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు శ్రేయస్కరం

ఎన్‌పీకుంట: సహజసిద్ధంగా లభించే పశువుల ఎరువు, జనుము, జీలుగ వంటి సేంద్రియ ఎరువులు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు జె.సనావుల్లా తెలిపారు. ఎన్.పీ.కుంట-2, మరికొమ్మదిన్నె రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి, ఏఈఓ శిరీష, వీఏఏ ఇంతియాజ్, రైతులు పాల్గొన్నారు.

దంపతులకు గాయాలు

చెన్నేకొత్తపల్లి : కోన క్రాస్ వద్ద మంగళవారం కారు బోల్తా పడిన ఘటనలో భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. ఎస్‌ఐ సత్యనారాయణ వివరాల మేరకు.. రిటైర్డ్ ఇంజినీర్ వీరన్నగౌడ్, అతని భార్య బసమ్మ కారులో బెంగళూరు నుంచి బళ్లారికి బయలు దేరారు. కోన క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని కారులో ఉన్న వారిని బయటకు తీసి పోలీసు వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులకు స్వల్పగాయాలయ్యాయని వైద్యులు తెలిపారు.



కనువిందు

ధర్మవరం రూరల్: పల్లె సీమల్లో అందాలకు కొదువుండదు. చూసే కనులు వుంటే చాలు ప్రతిదీ అద్భుతంగా కనిపిస్తుంది. మండల పరిధిలోని పోతులనాగేపల్లి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించి, శాంతించింది. గ్రామస్తులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే చిత్రావతి నదిపై నిర్మించిన బ్రిడ్జి మీదుగానే వెళ్లాలి. ఉదయం వేళ పంట పొలాలను కప్పుకున్న మంచు తెరలు.. చిత్రావతి నది అందాలు కట్టి పడేస్తున్నాయి.



కక్షలకు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు కక్షలకు దూరంగా ఉండాలని ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి మల్లాకాలువలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా చట్ట పరిధిలోనే జీవించాలన్నారు. చట్టాన్ని అతిక్రమించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా గొడవలకు దూరంగా వుండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రాజ్యాంగంతోనే అందరికీ న్యాయం, స్వేచ్ఛ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం: ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తూ గౌరవించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో కళాజ్యోతి సర్కిల్‌లోనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ రాజ్యాంగానికి కట్టుబడి జీవించాలని తెలిపారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు చౌడప్ప, దేవరకొండ రమేష్, కుణుతూరు గోపాల్, అజంతా కిష్ట, గుజ్జల సల్లప్ప, గజ్జల శివ, గుజ్జల బొమ్మన్న, వెంకటరమణ, కేశగాళ్ల కృష్ణమూర్తి, నామాల రామంజినేయులు, మేకల నరసింహులు, లక్ష్మీనారాయణ, బాబయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే సమానత్వం



నిడిగల్లులో ఉపాధి హామీ పని వద్ద జాతీయ జెండాను ఎగుర వేసిన దృశ్యం

తాడిమర్రి: భారత రాజ్యాంగంతోనే సకల జనులకు సామాజిక, రాజకీయ, న్యాయంలో సమానత్వం లభిస్తోందని డ్వామా ఏపీడీ వెంకటా చలపతి పేర్కొన్నారు. మంగళవారం నిడిగల్లులో ఉపాధి హామీ కింద చేపట్టిన అమృత్ సరోవర్ పని దగ్గర కూలీలతో కలసి ఆయన రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అక్కడే జాతీయ జెండా ఎగురవేశారు.

రాజకీయ పార్టీ ఫ్లెక్సీ తొలగించాల్సిందే!



ఫ్లెక్సీ అంశంపై ఎంపీడీఓను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్

కదిరి అర్బన్: ప్రభుత్వ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ ఫ్లెక్సీని తక్షణమే తొలగించాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ప్రారంభంలోనే కార్యాలయం వద్దనున్న అధికార పార్టీ ఫ్లెక్సీని తీసేయాలంటూ ప్రజాప్రతినిధులు అడ్డు తగిలారు. తొలగిస్తామని ఎంపీడీఓ పోలప్ప హామీ ఇవ్వడంతో శాంతించారు. యర్రదొడ్డి పంచాయతీలో పలువురు రైతులు మామిడి మొక్కలు నాటుకున్నారని, అయితే వారికి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున బిల్లులు పెట్టడం లేదని ఎంపీపీ తెలగా.. పరిశీలించి బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని ఏపీఓ హరూన్ రషీద్ హామీ ఇచ్చారు. మొటుకుపల్లిలో విద్యుత్ సమస్య గురించి తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ రూపా ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్నం, కాళసముద్రం గ్రామాల్లో రైతుల కోసం నిర్మించిన విత్తన గోదాములను వినియోగంలోకి తేవాలని పట్నం సర్పంచ్ చలపతి నాయక్ సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ రాధాబాయి, తహసీల్దార్ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయ, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కదిరిలో అంబేడ్కర్ కూడలి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ మహేష్, సిబ్బంది



కొత్తచెరువులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు



చెన్నేకొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ, ఎస్‌ఐ, సర్పంచు

కదిరి/ కదిరి అర్బన్/ పుట్టపర్తి/ పుట్టపర్తి అర్బన్/ నల్లచెరువు/ ధర్మవరం/ ధర్మవరం అర్బన్/ బత్తలపల్లి/ కనగానపలి/ చెన్నేకొత్తపల్లి/రామగిరి :

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. దేశానికి అతిపెద్ద రాజ్యాంగాన్ని అందజేసిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌దేనన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ఉండాల్సిన గొప్ప గ్రంథం రాజ్యాంగమని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర భావనను వారు వివరించారు. మంగళవారం కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ తదితర రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో రాజ్యాగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగంపై విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

టీబీపై అవగాహన

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎనుములపల్లి వృద్ధాశ్రమంలో జిల్లా టీబీ సూపర్‌వైజర్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో వృద్ధులకు టీబీపై అవగాహన కల్పించారు.